


# పరదేశీ కథలు

## – చిట్టే సిద్ధ లలిత



-88-

## ఎడారి నవ్వింది..

సలామాలేకుం.. ఆలేకుం సలాం.. పొద్దున్నే దుబాయ్ నుండి కొన్ని అరబిక్ కుటుంబాలు విమానం దిగినట్లున్నాయి. వాళ్ళు సెలవులను కువైట్ లో గడపడానికి వచ్చినట్లున్నారు. పలకరింపులు నవ్వులతో స్వాగతం పలుకుతూ హోటల్ లాబీ సందడిగా వుంది. ఇంకా చీకట్లు పూర్తిగా తొలగలేదు. తూరుపు ఆకాశాన వెలుగులు విచ్చుకోలేదు.

డిసెంబర్ నెల కావడంతో పట్టణం చలితో ముణగదీసుకుని పడుకొని వుంది. ప్రతిరోజూ డ్రైవర్ తో బస్ లో ఎయిర్ పోర్టుకు వెళ్ళి పైలట్, కో పైలట్ తో సహా 14 మంది బ్రిటిష్ ఎయిర్వేస్ క్రూను హోటల్ కు తీసుకు రావడం నా పని.

వారికి రూములు అలాట్ చేయడం, బ్రేక్ ఫాస్ట్, స్విమ్మింగ్ పూల్, షాపింగ్ మాల్ కి వెళ్ళే గైడన్స్ ఇవ్వడం, అవసరాలకు లోకల్ కరెన్సీ క్యాష్ గా అందించడం లాంటి పనులు కూడా నావే. చాలా బాధ్యతాయుతమైన పని. ఫైవ్ స్టార్ హోటల్స్ లో ఒక్క పొరబాటు కూడా జరగకూడదు. వ్యాపారవేత్తలైన దేశ విదేశీయులు ప్రపంచం నలుమూలలనుండీ వస్తుంటారు. వారి రంగు, రూపు, భాషలకు ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా వారిని గౌరవించాలి.హాస్పిటాలిటీ ఫీల్డ్ కత్తిమీద సాములాంటిది.

అందుకే హోటల్స్ లోని ఫ్రంట్ ఆఫీస్ అడ్మిన్ లో వర్క్ చేసే వాళ్ళని ఎలిగేంట్ ఆర్మీ అంటారు.ఆరోజు కూడా నేను పైలట్ ఇచ్చిన వివరాలతో తయారు చేసిన బ్రిటిష్ ఎయిర్ వేస్ క్రూ లిస్ట్ ను సీనియర్ ఆపరేటర్ ఎలీనా చేతికి అందించాను. ఆమె క్రూ డిటైల్స్ ని మెయిన్ సిస్టంలో అప్డేట్ చెయ్యాలి. నేనిచ్చిన పేపర్ ను ఒకసారి అలా చూసి టేబుల్ పైకి విసిరి కొట్టింది.

ఆమెకెందుకంత కోపం వచ్చిందో నాకర్థం కాలేదు. భృకుటి బిగించి ప్రశ్నార్థకంగా చూసాను.

"నీ కొలీగ్ గ్రేస్ ఇచ్చే లిస్ట్ చూడు ఎంత ఆర్డర్లో వుందో. నువ్వు కూడా ఇలా తయారుచేసి పట్రా" చెప్పింది ఇంగ్లీష్ లో.

ఇంత రూడ్ గా బిహేవ్ చేస్తోంది ఏమిటో? ఈ రోజు దీనికి పిచ్చి పట్టిందా అనుకుంటూ గ్రేస్ ఇచ్చిన లిస్ట్ ను చూసాను. నేను క్రూ పేర్లను నిలువుగా రాస్తే తను అడ్డంగా రాసింది అంతే తేడా.

"అయినా ఒక సంవత్సరం నుండీ ఇలాగే ఇదే ఫార్మాట్ లోనే కదా ఇస్తున్నాం" అన్నాను.

"ఏమో నాకు తెలియదు. మాకు ఇలాగే కావాలి" చెప్పింది సీరియస్ గా.

తన ప్రవర్తన నార్మల్ గా అనిపించలేదు.మళ్ళీ లిస్ట్ ప్రిపేర్ చెయ్యాలంటే అర్ధగంట పడుతుంది.

ఈ రోజు బ్రేక్ ఫాస్ట్ సమయం నాకు మిస్ అయినట్లే. ఆకలేస్తోంది. ప్రాణం ఉసూరుమంది. పేపర్ కప్పులోకి కాఫీలట్టే తీసుకుని సిస్టం ముందు కూర్చున్నాను.

"ఏమయింది" ఆరాగా ప్రశ్నించింది దీనా.

"లిస్ట్ గ్రేస్ లాగే ఇవ్వాలట" చెప్పాను నీరసంగా. నవ్వింది దీనా.

"నీకో సంగతి తెలుసా.. ఈ ఎలీనా చిట్స్ వేస్తోంది. ఇన్స్టాల్మెంట్స్ లో ఎలెక్ట్రానిక్ వస్తువులను అమ్ముతూ బిజినెస్ చేస్తోంది.

గ్రేస్ తన దగ్గర చిట్ వేసింది. కస్టమర్ గా వస్తువులన్నీ కొంటోంది. అందుకే గ్రేస్ అంటే ఇష్టం. అందులో వాళ్ళిద్దరూ పిలిప్పినోస్ కదా. మనం ఇండియన్స్ మి. అంతా వివక్షత."

"నిన్ను అడిగితే నువ్వు అప్పుగా ఏవీ కొనను. చిట్స్ వేయడం నాకు ఇష్టం లేదు అన్నావట కదా. అందుకే నీకు హార్డ్ టైం ఇస్తోంది ఎలీనా" చెప్పింది దీనా కళ్ళెగరేస్తూ.

ఆశ్చర్యపోయాను నేను. అమ్మో అదా సంగతి. ఇంత కుట్రా.. హ్మ్ ఈ ఎలీనా చాలా క్రూరమైనది. ఎలా ఎదుర్కోవాలో ఏమో అనుకుంటూ నిట్టూర్చాను.

మరుసటి రోజు లంచ్ అయ్యాక లాకర్ రూం లో మరలా కొన్ని మేకప్ కిట్స్ నాకు చూపించి "అన్నీ మాక్ ప్రొడక్ట్స్. డిస్కౌంట్ ధరలు. కొంటావా" అని అడిగింది ఎలీనా.

ఎలాగైనా నా వద్ద ఏదో ఒకటి కొనిపించాలి అనే పట్టుదల కనబడింది ఆమెలో. ఇక తప్పదనుకొంటూ ఒక లిప్ స్టిక్ సెలక్ట్ చేసుకుని నాలుగు దినార్లు చేతిలో పెట్టాను.

ఎలీనా ముఖం సంతోషంతో విప్పారింది.

హమ్మయ్య పోతే పోయాయి నాలుగు దినార్లు. సామరస్యంగా కాలం గడపచ్చు అనుకున్నాను. కానీ ఆ ఆనందం వారం రోజులు కూడా నిలవలేదు.

పదిరోజుల తరువాత వాచీలు పట్టుకొచ్చి "జీతం వచ్చాకే ఇవ్వచ్చు ఇప్పుడు కొనమని" అడుగుతోంది ఎలీనా. కొందరు పిలిప్పీనో అమ్మాయిలు ఎగబడి కొంటున్నారు. గ్రేస్ కూడా రెండు వాచ్ లు కొని నా వైపు గర్వంగా చూసింది.

"చూసావా నీ కొలీగ్ గ్రేస్ రెండు కొనుక్కుంది" అంది ఎలీనా.

నాకు చాలా కోపం వచ్చింది. కానీ తమాయించుకున్నాను. వర్క్ ప్లేస్ లో తను అలా బిజినెస్ చెయ్యడం కొనమని బలవంతం చెయ్యడం నాకు నచ్చడం లేదు. మేనేజ్మెంట్ కు తెలిస్తే తనకు ముప్పే. అయినా పిలిప్పినోళ్ళు ఒకే మాటగా, ఒకే బాటగా అందరూ కలిసికట్టుగా వుంటారు.

ఒకరికొకరు సహాయంచేసుకుంటారు. ఎదుగుదలకు సహకారాన్ని అందిస్తారు.

మన ఇండియన్స్ ఇలా కాదు. అదేంటో మనవాళ్ళు పైకెదుగుతుంటే ఓర్వలేక కిందకి లాగేస్తారు.

అలాగే మన భారతీయులు మేం కేరళ వాళ్ళం, గోవా వాళ్ళం, మళయాళీలం, తమిళియన్స్ మి అని అనుకుంటూ విభజించుకుంటూ వుంటారు.

పిలిప్పీన్స్ వాళ్ళ ఐక్యత చూస్తే ఒకవైపు అసూయగా వున్నా మరొకవైపు ముచ్చటేస్తుంది.

ఇంతలో దీనా వచ్చి కూర్చుని "ఈ ఎలీనా వ్యవహారం శృతి మించుతోంది. మనం కొనకపోతే మన మీద కక్ష పెంచుకుంటోంది.ఎచ్ ఆర్ కి కంప్లైంట్ చేద్దామా" అంది గుసగుసగా.

"వాళ్ళ సంఖ్య ఎక్కువగా వుంది. వత్తాసు పలికి నిజాన్ని అబద్దం చెయ్యగలరు. విషయాన్ని మనం ప్రూవ్ చెయ్యగలమా.." సందేహించాను.

"ఇలా అయితే లాభం లేదు. ఏదో ఒకటి చెయ్యాలి" అంటూ తన సెక్షన్ వైపు వెళ్ళిపోయింది దీనా.

ఏదో పనిబడి లోపలికి వెళితే నన్ను చూసి కావాలనే.. "ఇండియన్స్ ఎంత పిసినారులో తెలుసా. డబ్బు అస్సలు ఖర్చు పెట్టరు" అని కొలీగ్ తో చెబుతోంది ఎలీనా.

పీకలదాకా కోపం వచ్చింది కానీ నిగ్రహించుకుని "మా ఇండియన్స్ కి ఎక్కడ దేనికి ఎలా ఖర్చు పెట్టాలో బాగా తెలుసు. మనీని అనవసరంగా మేము వ్యర్థం చెయ్యము. ఒకసారి నా రూంకి వచ్చి చూడు. నా రూం అంతా షాపింగ్ బ్యాగులతో నిండిపోయి వుంటుంది, నాకున్న బట్టలు, చెప్పుల్లో సగం కూడా నీకు వుండవు" అని చెప్పాను కాస్త కోపంగా.

"అబ్బో అలాగా" అంటూ కళ్ళెగరేసింది పొగరుగా.

తన ముఖం చూడాలంటేనే అసహ్యం కలిగి ఇదొక రాక్షసి దీనితో మాటలేంటి అనుకుంటూ విసురుగా బయటికి వచ్చేసాను. అప్పట్నించీ నాపై ద్వేషాన్ని పెంచుకుని ప్రతి చిన్న విషయానికీ సాధించడం మొదలుపెట్టింది ఎలీనా. దానికి తోడు గ్రేస్ ఒకటి. వీళ్ళంతా పనిచేసే చోట ఒక గ్రూపుగా ఏర్పడతారు.

గ్రేస్ కు అప్పులు చెయ్యడం బాగా అలవాటు. ఎప్పుడూ ఏదో కారణం చెప్పి ఎవరో ఒకరిని డబ్బు అడుగుతూ వుంటుంది. నేను అప్పు తీసుకోవడానికి, ఇవ్వడానికి బద్ధ విరోధిని. ఉన్నదాంట్లో సర్దుకోవాలి కానీ అస్తమానం అప్పులు అడగడం ఏమిటో.. నాకు అర్థం కాలేదు. అందులో గ్రేస్ ఆర్నెల్ల క్రితమే కొత్తగా జాయిన్ అయింది. తనను ఎలా నమ్మగలం.

గ్రేస్ కూడా అలుపెరగకుండా ప్రతినెలా జీతం రాగానే అప్పు అడుగుతూనే వుంది. సదభిప్రాయం కలగలేదు నాకు. మనసును గట్టిగా చేసుకుని ఎప్పటికప్పుడు ఇవ్వననే చెబుతున్నాను. కాదు, లేదు, ఇవ్వను అని చెప్పడం చాలా ఇబ్బందిని కలగజేస్తుంది.

సంస్థల్లో ఎన్ని నియమ నిబంధనలు వున్నా బలవంతుడిదే రాజ్యం. నోరున్న వాడిదే న్యాయం. నైతికత లేనివాళ్ళకి ఏవీ ఎక్కడా అడ్డు రావు. వాళ్ళ కోసం అన్నీ సడలింపబడతాయి. కానీ ఏదో ఒకరోజు ఎవరు తీసుకున్న గోతిలో వాళ్ళు పడక మానరు అనేది నా నమ్మకం. రాష్ట్రాల వారీగా విభజించుకుని భాషా భేదాలను పాటించే మన భారతీయులు విదేశాల్లో కూడా ఎవరికి వారే గిరిగీసుకుని జీవిస్తున్నారు. అంతా కలిసికట్టుగా వుంటే అన్యాయాన్ని ఎదిరించవచ్చు.మనవాళ్ళని సంఘటిత పరచవచ్చు.

మా హోటల్లో వర్కర్స్ ఎక్కువగా భారతీయులే.. అయినా భాషా భేదాలను, వర్గీకరణ సూత్రాలను వీరు అనుసరిస్తున్నారు అనుకుంటాను.

"దేవుడా.. మా దేశంలో ఎందుకిన్ని మతాలు, కులాలు, భాషలు, భేదాలు ఉన్నాయి. అందరూ ఒక్కటిగా ఎందుకు లేరు" అని అపుడపుడూ చింతిస్తుంటాను నేను.

కొందరి స్వార్థం స్వలాభాపేక్ష వలన చుట్టూ వున్న చాలా మంది నష్టపోతారు. సమాజం కలుషితమవుతుంది. చిన్న విషయమైనా సరే సమాజానికి వీళ్ళే చీడపురుగులు.హౌస్ కీపింగ్ లో పని చేసే శ్రీలంక అమ్మాయి కైకేయి ఆరోజు నాకు కాల్ చేసింది.

"ఎలీనా అమ్మే వస్తువులన్నీ బ్రాండ్ అంటుంది కానీ అన్నీ డూప్లికేట్ వే. శ్రీలంకలో వున్న మా ఫామిలీకి పది వాచ్ లు కొంటే అన్నీ పది రోజుల్లోనే ఆగిపోయాయి" బాధగా చెప్పి లబోదిబో మంది. అయ్యో అనిపించింది. ఎలీనా బారినుండి జనాలను ఎవరు రక్షిస్తారో అర్థం కాలేదు. ఇంతలో ఎలీనా నుండి కాల్ రానే వచ్చింది.

"గెస్ట్ రిలేషన్స్ లలిత స్పీకింగ్ హౌ మే ఐ హెల్ప్ యూ" అన్నాను..

"రూం 1105 లోని లేడీ గెస్ట్ 6 గంటలకి వేకప్ కాల్ అడిగింది. నేను ఎన్నిసార్లు కాల్ చేసినా లిఫ్ట్ చెయ్యడం లేదు. ఏమయిందో తనకి. మీరు సెక్యూరిటీని తీసుకుని వెళ్ళి ఒకసారి రూం తెరిచి చూడండి. గెస్ట్ ఆరోగ్యం బాలేదేమో లేక బయటికి వెళ్ళిపోయిందో.. ఒక్కోసారి రాత్రిపూట సడన్ గా గుండెనొప్పి వచ్చి పోయినా పోతారు వీళ్ళు" అని చెప్పింది.

"నేను ఇప్పుడే ఎయిర్ పోర్ట్ కి బయలు దేరాను ఎలీనా. నువ్వు ఈ పని గ్రేస్ కి అప్పగించు" అన్నాను.

"గ్రేస్ బ్రేక్ ఫాస్ట్ కి కెఫిటేరియాకు వెళ్ళింది. పాపం రాత్రి ఏమీ తినలేదు ఆకలిగా వుందట. తనను ఇప్పుడు పిలవలేను. మీరే వచ్చి ఈ పని చూడాలి. అయినా ఈ మధ్య నేను ఏ పని చెప్పినా కాదంటున్నారు. నేను మీపై మేనేజర్ కి రిపోర్ట్ చేస్తాను" అంది కోపంగా.

"సరే అలాగే చెయ్యి" అన్నాను నేనూ కోపంగా.

అప్పటికే మా కారు కువైట్ ఎయిర్ పోర్ట్ రోడ్ లో వుంది. తిరిగి రాలేను కదా. ఎలీనా శిఖండి జాతికి చెందినది. అన్నట్లే ఈ విషయాన్ని మేనేజర్ కి కంప్లైంట్ చేసింది. నేను ఎయిర్ పోర్ట్ నుండి రాగానే మేనేజర్ నుండి పిలుపు. అటునుండి ఎలీనా కూడా ముక్కుపుటాలు అదురుతుండగా తల ఎగరేసుకుంటూ వచ్చింది. ఇక వాదాలు, వివాదాలు, వివరణల పర్వం మొదలయింది. మా డ్రైవర్ సాక్ష్యం ఇచ్చాడు. ఎలీనా కాల్ చేసినప్పటికి మేము ఎయిర్పోర్ట్ రోడ్లో హోటల్ కి 3 కిమీ దూరంలో వున్నామని.. ఇంకేమనగలడు మేనేజర్. ప్రత్యామ్నాయం చూసుకోవాలని ఎలీనాకే సర్ది చెప్పాడు. టైం వేస్ట్. లంచ్ మిస్సయింది. ఈ ఎలీనా ప్రతిరోజూ ఒక గొడవ రేపెడుతోంది దీనితో ఎలా వేగాలా అని తల పట్టుకున్నాను నేను.

దీనా వచ్చి "దీన్నిఎడారి ఇసుకలో గొయ్యి తీసి పూడ్చాలి" అంది. "పూడ్చినా తిరిగి వచ్చేస్తుందిది" అన్నాను నేను. ఎవరి ఆటలైనా సాగేది కొన్నిరోజులే.

అన్నిరోజులూ వాళ్ళవి కావు. ఆ రోజు డ్యూటీకి వెళ్ళేసరికి ఎలీనా వెక్కివెక్కి ఏడుస్తూ కళ్ళు తుడుచుకుంటూ కనిపించింది. చుట్టూ కొందరి ఓదార్పులతో వాతావరణం కారుమబ్బులు కమ్మినట్లుంది. కారణం తెలియనప్పటికీ నాకెందుకో మనసులో ఆనందం చిందులేసింది. నవ్వడం సభ్యత కాదు కాబట్టి నా ముఖాన్ని సీరియస్ గా పెట్టి "ఏమయింది" అని ఆపరేటర్ ఈజిప్ట్ అమ్మాయి రాషా ను అడిగాను.

రాషా నా చేయి పట్టుకుని బయటికి తీసుకొచ్చి పకపకా నవ్వుతూ బెల్లీ డ్యాన్స్ చేయసాగింది. "ఉన్న నాలుకకు మందేస్తే కొండ నాలుక ఊడిపోయిందట హ్హాహ్హా" అని పడిపడి నవ్వింది.

విషయం అర్థం కాక నవ్వాలో ఏడ్వాలో తెలియక అందమైన ఆ అరబ్ సుందరి నవ్వును అలా చూస్తుండిపోయాను నేను.

అరబ్బీలకు నవ్వొచ్చినా కోపమొచ్చినా పట్టలేము. వాళ్ళను ఆపలేము. కాసేపటికి ఇద్దరికీ నెస్కేఫె కలుపుకొచ్చి కూర్చుని "ఏం జరిగిందో తెలుసా.. గ్రేస్ రాత్రికి రాత్రే పారి పోయింది. వెళ్తూ వెళ్తూ ఎలీనా దగ్గర పొడుకున్న చీటీ డబ్బులు, కొన్న వస్తువులు అన్నీ పట్టుకెళ్ళింది. దీనికిప్పుడు లక్షల డబ్బు ఎగనామం పెట్టింది.
చాలామంది దగ్గర మా అమ్మకు ఆరోగ్యం బాలేదు, మా నాన్నకు బాలేదని చెప్పి అప్పులు తీసుకుంది. ఎవరికీ తిరిగి ఇవ్వలేదు. డబ్బు ఇచ్చిన వాళ్ళందరూ ఏడుస్తున్నారు. గ్రేస్ దొంగ అట. ఇదంతా ప్లాను ప్రకారమే చేసి పారిపోయింది. ఎక్కువగా నష్టపోయింది ఎలీనానే. గ్రేస్ మంచిది అంటూ వెనకేసుకొని వచ్చేది.
వేల దినార్లు ముంచేసి రాత్రికి రాత్రే విమానమెక్కి వెళ్ళిపోయిందది. దీని కొవ్వు ఇప్పుడు అణిగింది" చెప్పింది కాఫీ సిప్ చేస్తూ.
"ఆ.. నిజమా నమ్మశక్యంగా లేదీ విషయం" అంటూ ఆశ్చర్యపోయాను నేను.
"అవును ఇంకా డ్రైవర్ రహీం వద్ద వెయ్యి డాలర్లు, బెల్ బోయ్ మున్ను వద్ద వంద దినార్లు, రెస్టారెంట్లోని వెయిట్రెస్ జేన్ వద్ద యాభై దినార్లు అప్పు చేసింది. ఇంకా తెలియని వాళ్ళు ఎందరో..కానీ ఎలీనాను బాగా నమ్మించి పెద్ద దెబ్బే కొట్టింది.
ఇది కోలుకోవాలంటే ఒక సంవత్సరం పడుతుంది. చూసావా.. ఒయాసిస్ అని ఆశ పడితే చివరికి ఎలీన్ కి ఎండమావి మిగిలింది. తగిన శాస్తి జరిగింది" అంటూ గట్టిగా నవ్వింది.
ఈసారి నేనూ తన నవ్వుతో శృతి కలిపి హాయిగా నవ్వాను.
ఎవరు తీసుకున్న గోతిలో వాళ్ళు పడక తప్పదనే సత్యం తెలిసిన ఎడారి కూడా మా నవ్వులతో జత కలిపింది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments